ప్రజాశక్తి
ఆదివారం 19 మార్చి 2023
5
విజయనగరం

జాతీయ సేవా దళం కార్యకర్తలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయనగరం కోట

జాతీయ సేవా దళం కార్యకర్తలుగా పనిచేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.వెంకట ఉజ్వల్ తెలిపారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 నుండి 29 సంవత్సరాల వయసు కలిగి, కనీసం పదో తరగతి విద్యార్హత గలవారు అర్హులని చెప్పారు. వాలంటీర్లుగా స్వచ్ఛంద సేవచేసే స్వభావం ఉండాలని తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్స్, ఆండ్రాయిడ్ మొబైల్ అప్లికేషన్స్, ఈ బ్యాంకింగ్, డిజి ధన్ వంటి అప్లికేషన్లపై అవగాహన, ఇతర సాంకేతిక ఉన్నత విద్యార్హత, మహిళా అభ్యర్థులకు, నెహ్రూయువకేంద్ర అనుబంధ సంఘాల సభ్యులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.5వేలు గౌరవ వేతనం చెల్లిస్తామన్నారు. అభ్యర్థులు ఆన్లైన్‌లో www.nyks.nic.in వెబ్‌సైట్ ద్వారా గానీ, వ్యక్తిగతంగా గానీ దరఖాస్తు చేయాలని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24లోగా దరఖాస్తు చేయాలని సూచించారు.

గిరిజనులకు మిగిలేది 'చింతే'

మద్దతు ధర లేక నష్టాల పాలు

నాణ్యత లేదని పంపిస్తున్న జిసిసి

దళారుల చేతిలో మోసపోతున్న గిరిజనులు

సంతలో విక్రయానికి గిరిజనులు తీసుకొచ్చిన చింతపండు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో గిరిపుత్రులు తరతరాల నుంచి అడవినే నమ్ముకుని పోడు వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఏటా పండే ప్రధాన పంటలైన చింతపండు, జీడిపై ఎక్కువ శాతం ఆధార పడుతున్నారు. ఈ ఏడాది జీడిపంట దిగుబడి లేకపోవడంతో చింత పంట పైనే ఎక్కువ శాతం ఆశలు పెట్టుకున్నారు. చింతపండు సేకరణ కోసం పిల్లాపాపలతో కొండలు, గుట్టలపై ఉన్న చింత చెట్ల వద్దకు వెళ్లి ఎంతో కష్టపడి బొట్టలు ఏరి చింతపండు అమ్మకానికి కిలోమీటర్ల కాలినడకన మండల కేంద్రానికి, వారపు సంతలకు, జిసిసి ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకెళుతున్నారు. చింతపండు సేకరణలో వ్యయ ప్రయాసలు పడుతున్న గిరిజనులకు గిట్టుబాటు ధర లేక చివరకు చేసేది లేక తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది. మరోవైపు జిసిసి నిబంధనలు గిరిపుత్రులకు ఆందోళన కలిగిస్తున్నాయి. జిసిసి కొనుగోలు కేంద్రాలకు గిరిజనులు చింతపండు అమ్మకానికి తీసుకెళ్తే నాణ్యత లేదని, పొడిగా లేదని, తడిచిన చింతపండు తీసుకువచ్చారని జిసిసి సిబ్బంది చెప్పడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిసిసి కిలో చింతపండు రూ.32.40 పైసలు మాత్రమే ధర నిర్ణయించడంతో దళారులను ఆశ్రయిస్తున్నారు.

గత ఏడాది ఇదే తంతు....

గత ఏడాది గిరిజనులు సేకరించిన చింతపండు కొనుగోలు చేయడంలో జిసిసి అధికారులు ఆన్లైన్ చెల్లింపులు విధానం తీసుకొచ్చారు. గిరిజనుల నుంచి అధికారులు ముందుగా చింతపండు కొనుగోలు చేసి డబ్బులు బ్యాంకు అకౌంట్లో వేస్తామని చెప్పడంతో చింతపండు అమ్మేందుకు గిరిజనులు ముందుకు రాలేదు. బయట మార్కెట్లో వర్తకులకు తప్పని పరిస్థితుల్లో తక్కువ ధరకే అమ్ముకొని తీవ్రంగా నష్టపోయారు.

పదివేల క్వింటాళ్ల దిగుబడి

జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మవలస, కొమరాడ, పాచిపెంట, మక్కువ, సీతంపేట, భామిని, సాలూరు మండలాల్లో 70 వేలకు పైగా చింత చెట్లు ఉన్నట్లు అంచనా. ప్రతి ఏటా పదివేల క్వింటాళ్ల వరకు చింతపండు దిగుబడి వస్తోందని అంచనా. గిరిజనులు సేకరించిన చింతపండును గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేస్తుంది. అనంతరం టెండర్లు పిలిచి వర్తకుల ద్వారా మైదాన ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. జిసిసికి జిల్లాలో కోల్డ్ స్టోరేజ్ లేకపోవడంతో పంట నిల్వలను ఇతర ప్రాంతాల్లో భద్రపరచాల్సిన పరిస్థితి నెలకొంది. జిసిసి నెల నెలా టన్నుల లెక్కన అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఏటా గిరిజనులు సేకరిస్తున్న చింతపండుకు టెండర్లు పిలుస్తున్నప్పటికీ జిసిసి కొనుగోలు చేస్తున్న ధర రావడం లేదు. దీంతో ఆ సంస్థ పూర్తిస్థాయిలో కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. నాణ్యత లేదని, తడిపిన చింత పండు తీసుకొస్తున్నారని రకరకాల కారణాలు చూపుతూ అంతంతమాత్రంగానే అధికారులు కొనుగోలు చేస్తున్నారని గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు సరికావు

గిరిజనుల నుంచి చింతపండు కొనుగోలు చేస్తున్న జిసిసి పలు నిబంధనలు పెట్టడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. చింతపండు సేకరణలో నాణ్యత లేదని, తడిపి తీసుకొస్తున్నారని అధికారులు చెప్పడంతో తక్కువ ధరకే బయట వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తుంది. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన జిసిసి ద్వారా గిరిజనులు సేకరించిన అన్ని రకాల అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలి.

మండంగి రమణ,
ఎపి గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు.

పాడి చింతపండునే కొనుగోలు చేస్తాం

గుమ్మలక్ష్మీపురం జిసిసి ద్వారా తాడికొండ, గుమ్మలక్ష్మీపురం, దేరువాడ, దుడ్డుఖల్లు, నీలకంఠాపురం, వంగర, వలసబల్లేరు, గొరడ, మొండెంఖల్ గ్రామాల్లో చింతపండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. గిరిజనులు సేకరిస్తున్న పొడి చింత పండు మాత్రమే కొనుగోలు చేస్తాం. తడి చింతపండు కొనుగోలు చేసే ప్రసక్తే లేదు. దళారులు కిలో చింతపండు రూ.25కు కొనుగోలు చేస్తే జిసిసి రూ.32కు కొనుగోలు చేస్తుంది.

వి.కృష్ణ ప్రసాద్,
జిసిసి మేనేజర్, గుమ్మలక్ష్మీపురం.

తప్పని దళారుల బెడద

గిరిజనులు సేకరిస్తున్న చింతపండు నాణ్యత లేదని జిసిసి అధికారులు కొనుగోలు చేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే పంట మొత్తాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది. గిరిజనుల నుంచి చింతపండు కొనుగోలు చేసిన వర్తకులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచి మంచి ధర పలికినప్పుడు విక్రయిస్తున్నారు. ఎంతో కష్టపడి చింతపండు సేకరిస్తున్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారు.

వంగర : శివ్వాంలో తడిచిన మొక్కజొన్నను ఆరబెడుతున్న రైతులు

పలుచోట్ల వర్షాలు

గాలులతో నేలకొరిగిన అరటి, మొక్కజొన్న

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

అల్పపీడనం ద్రోణి కారణంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో శనివారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. సీతంపేటలో ఎడతెరిపిలేని వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. మక్కువ, సాలూరులో ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. పలుచోట్ల పడిగులు కూడా పడ్డాయి. వీరఘట్టం మండలంలో వీచిన గాలులకు కిమ్మి గ్రామానికి చెందిన రౌతు సోమినాయుడు, త్రినాథనాయుడు, పోలినాయుడులకు చెందిన అరటిపంట నేలమట్టమైంది. రామభద్రపురం బొబ్బిలి, గరివిడి, చీపురుపల్లి, విజయనగరం బాడంగితెర్లాం, మెరకముడిదాం, లక్కవరపుకోట వర్షం కురిసింది. వర్షాలతో కళ్లాల్లో మట్టించేందుకు సిద్ధంగా ఉంచిన అపరాల పంట తడిచిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షం మామిడి, జీడిమామిడి, కూరగాయలు, చెరకు, మొక్కజొన్న పంటలకు అనుకూలంగాఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

350 ఎకరాల మొక్కజొన్నకు నష్టం

కొమరాడ : మండలంలో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షం ఈదురుగాళ్లు కారణంగా మండలంలోని 350 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిలినట్లు రైతులు చెబుతున్నారు. వర్షాలకు మొక్కజొన్న పంట పూర్తిగా నేలమట్టమైంది. చేతికి అంది వచ్చిన సమయంలో మొక్కజొన్న నేలమట్టం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంకా రెండు రోజులపాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో రైతుల్లో గుబులో మొదలైంది. నష్టపోయిన పంటలకు మండల వ్యవసాయ శాఖ అధికారి శంకరరావు ఆధ్వర్యంలో సిబ్బంది నివేదికలు సిద్ధం చేస్తున్నారు. మండలంలో నాలుగు రెవెన్యూ గ్రామాల్లో 144మంది రైతులకు చెందిన సుమారు 350 ఎకరాల్లో మొక్క జొన్న దెబ్బతిందన్నారు. కురుపాం వ్యవసాయ సహాయ సంచాలకులు అలజంగి నిర్మలజ్యోతితో కలిసి పంట పొలాలను పరిశీలించినట్టు తెలిపారు.

మొక్కజొన్న రైతులు ఆందోళన

వంగర : మండలంలోని శివ్వాం, తలగాం, ఎం. సీతారాంపురం, వంగర, సంగాం తదితర గ్రామాలలో కొంతమంది రైతులకు చెందిన మొక్కజొన్న పంట కోతకు రావడంతో ఇటీవల కోశారు. గత మూడు రోజులుగా తేలికపాటి వర్షపు జల్లులు కురుస్తుండడంతో మొక్కజొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండ ఏమాత్రం ఎక్కినా వెంటనే మొక్కజొన్న పిక్కలను ఆరబెట్టడం, చినుకులు పడితే వాటన్నిటినీ కుప్పలుగా వేసి టార్పాయిన్లతో కప్పడం వంటి పనుల్లో రైతులు నిమగ్నం అవుతున్నారు. వర్షం ఏమాత్రం ఎక్కువైతే పొలాల్లో ఉన్న పండిన పంటకు నష్టం కలుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మోసపూరిత వైసిపిని ఓడించారు

- పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు అభినందనలు
- టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైసిపి మోసకారి ప్రభుత్వం గనుకనే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, పట్టభద్రులు ఓడించారని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. శనివారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లంతా టిడిపి బలపర్చిన వేపాడ చిరంజీవిరావును గెలిపించడం అభినందనీయ మన్నారు. ముందుగా స్వతంత్రంగా పోటీ చేసిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు అభినందనలు తెలిపారు. మంచి ఓటింగ్‌ను సంపాదించారన్నారు. ఆమె ఎన్నికల సందర్భంగా ఎంతో హుందాగా వ్యవహరించారని, అటువంటి వారు అక్కడితో ఆగిపోకుండా ఈ ముందుకు సాగాలని కోరారు. వైసిపి ప్రభుత్వానికి పతనం ప్రారంభమైందన్నారు. ఈ ఎన్నికల్లో వైసిపి ఓటు బ్యాంకు 31శాతానికి పడిపోయిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఇదేతీరు కొనసాగుతుందని అన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, కనకల మురళీమోహన్, కంది మురళీనాయుడు, రొంగలి రామారావు పాల్గొన్నారు.

మెషిన్ లెర్నింగ్‌పై ముగిసిన వర్క్‌షాప్

విజయనగరం : సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో 'మెషీన్ లెర్నింగ్' పై జరుపుతున్న రెండు రోజుల వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. రెండోరోజు జీవశాస్త్రంలో ఆవిష్కరణలపై 'హౌ కంప్యూటర్ సైన్స్ కెన్ అన్‌లాక్ డిస్కవరీస్ ఇన్ బయాలజీ' అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. వక్త గా మైక్రోసాఫ్ట్ లో పరిశోధకులు రోహిత్ ద్వివేదుల వ్యవహరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డివి రామమూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

విజయనగరం : వాహనదారులకు డిఎస్‌పి ఎల్.మోహన్‌రావు ఆధ్వర్యాన ఎత్తుబ్రిడ్జి వద్ద హెల్మెట్ ప్రాధాన్యతపై శనివారం అవగాహన కల్పించారు. ప్రమాదాలకు గురైనా హెల్మెట్ వినియోగం వల్ల చిన్నపాటి గాయాలతో బయటపడవచ్చునన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్‌పి ఎల్.మోహనరావు, ట్రాఫిక్ ఎస్‌ఐలు లోవరాజు, దామోదర్, ఎఎస్‌ఐలు ఆదిత్య, నూకరాజు, ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-బొండపల్లి

ఇంటర్‌మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి శనివారం తనిఖీ చేశారు. బొండపల్లి మండలం గాయత్రి జూనియర్ కళాశాల, గంట్యాడ మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించారు. తరగతి గదులను తనిఖీ చేశారు. పరీక్షల కోసం చేసిన ఏర్పాట్లను ప్రిన్సిపాళ్ల ద్వారా తెలుసుకున్నారు. హాజరైన విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. మాల్ ప్రాక్టీసు జరగకుండా చూడాలని, పకడ్బంధీగా పరీక్షలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

22,625 మంది పరీక్షకు హాజరు

శనివారం జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 22,625 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాధారణ కోర్సుకు సంబంధించి 19,474 మంది హాజరు కావాల్సి ఉండగా, 18,794 మంది హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 4416 మంది హాజరు కావాల్సి ఉండగా, 3831 మంది హాజరయ్యారు. రెండు పరీక్షలకు కలిపి మొత్తం 1265 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐఒ మూడు పరీక్షా కేంద్రాలను, డిఇసి ఐదు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందం సభ్యులు జిల్లా అంతటా విస్తతంగా తనిఖీలు నిర్వహించారు. మాల్ ప్రాక్టీసుకు పాల్పడుతున్న ఒక విద్యార్థిపై కేసు నమోదు చేశారు.

21న ఆశావర్కర్ల ధర్నా

డిఎంహెచ్‌ఒకు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశా వర్కర్లు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న మంగళవారం వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్లు ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు బి.సుధారాణి, మహాలక్ష్మి, కనక మహాలక్ష్మి తెలిపారు. ఈమేరకు శనివారం డిఎంఅండ్ హెచ్‌ఒ ఎస్‌వి రమణ కుమారికి వినతి అందజేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని, వేధింపులు ఆపాలని, ప్రభుత్వం పెంచిన వేతనాలు అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

డిఎంహెచ్‌ఒకు వినతినిస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

ప్రజలను దోచుకుంటున్న బిజెపి

రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలను నిట్టనిలువునా దోచుకుంటోందని రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. సమస్యలపై పోరాడితనే పార్టీ బలపడుతుందన్నారు. ఈనెల 19నుంచి నెలరోజుల పాటు ప్రజల్లోకి ఈ కార్యక్రమాన్ని తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి చెంపదెబ్బ తగిలిందన్నారు. డబ్బు, వెండి నాణేలు పంచి, దొంగ ఓట్లు చేర్పించి ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా వైసిపికి ప్రజలకు బుద్ధి చెప్పారన్నారు. ప్రజల్లో వైసిపి పట్ల వ్యతిరేకత రోజు రోజుకూ పెరుగుతోందన్నారు. వచ్చే నెలలో రాహుల్‌గాంధీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించనున్నారని తెలిపారు. నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ సంపదను సృష్టిస్తే నేడు బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, నాయకులు పరమేశ్వరరావు, భాస్కరరావు, డోల శ్రీనివాస్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి

కమిషనర్ శ్రీరాములు నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలకు విధించిన వడ్డీని ప్రభుత్వం మాఫీ చేసిన నేపథ్యంలో పన్ను చెల్లింపు దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు తెలిపారు. శనివారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 31 తేదీలోగా ఏకమొత్తంలో పన్నులు చెల్లిస్తే పూర్తి వడ్డీ మాఫీ జరుగుతుందన్నారు. నగరంలో 67,480 అసెస్మెంట్లు ఉన్నాయన్నారు. వీటి ద్వారా పాత పన్ను బకాయి రూ.15.67 కోట్లు ఉండగా వాటికి రూ.20.27 కోట్లు వడ్డీగా ఉందన్నారు. ఆస్తిపన్నుదారులు అసలు రూ.15.67 కోట్లు చెల్లిస్తే రూ.20.27 కోట్ల వడ్డీ మాఫీ అవుతుందని స్పష్టం చేశారు. వడ్డీ రాయితీపై పన్నులు చెల్లించే చెల్లింపుదారుల సౌకర్యార్థం నగరపాలక సంస్థ కార్యాలయంలో మూడు కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 10 సచివాల యాలకు ఒక టీం చొప్పున మొత్తం 12 టీములను ఏర్పాటు చేశామన్నారు. పన్ను చెల్లింపుదారులకు మొబైల్ బృందాలు కూడా సహకరిస్తాయని చెప్పారు. పన్ను చెల్లింపులను ఆన్‌లైన్ గాని సచివాలయాలలో గాని నగరపాలక సంస్థ కార్యాలయంలో గాని లేదా ఇంటి వద్దకు వచ్చే ప్రత్యేక బృందాలకు గాని పన్నులను చెల్లించవచ్చున్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

పలుచోట్ల హౌసింగ్ డే

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్న గృహాలను, కాలనీలను త్వరితగతిన పూర్తి చేయించాలన్న కృత నిశ్చయంతో, ప్రతీ వారాంతంలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్ణయిస్తోంది. దీనిలో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా మండలాల ప్రత్యేకాధికారులు, గహనిర్మాణశాఖ అధికారులు, ఎంపిడిఒలు జగనన్న కాలనీలను, వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలను సందర్శించారు. గృహ నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. లబ్దిదారుల సమస్యలను తెలుసుకున్నారు. ఇసుక, సిమ్మెంటు సరఫరాపై ఆరా తీశారు. లబ్దిదారులకు కావాల్సిన అన్ని రకాల వసతులను ప్రభుత్వం సమకూరుస్తుందని, ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రోడ్లు, విద్యుత్, నీటి సదుపాయం కల్పించేందుకు తీసుకున్న చర్యలను వివరించారు. దశలవారీగా బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించడం జరుగుతోందని చెప్పారు. ఇళ్ల నిర్మాణాన్ని శతశాతం పూర్తిచేసి, ఉగాదికి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులు కోరారు.

మండలి ఫలితాల్లో

ఉత్తరాంధ్ర సమస్యల ఎజెండా ఎంత?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'రాజకీయాలు క్రమబద్ధంగా సంస్థాగతం చేసిన విధ్వేషాలు' అంటూ చాటిచెప్పిన ప్రష్యన్ రాజనీతివేత్త బిస్మార్క్ మాటలు నిజం కాకుండా పోలేదనడానికి ఇటీవల జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలే తార్కాణం. ఉత్తరాంధ్ర ప్రాంతం వెనుకబాటు నివారణకు ఆర్థిక ప్యాకేజీ, లక్షల ఎకరాలకు సాగునీరందించగలిగే సుజల స్రవంతి, వేల మంది కార్మికులు ఆధారపడే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రెండేళ్లుగా పోరాడుతున్న కార్మికుల పక్షాన నిలబడాలనే ప్రధాన సమస్యలేవీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెద్దగా అజెండా కాలేదు. స్థానిక పరిస్థితులు, రాజకీయ పార్టీలు బలపరిచిన వ్యక్తులు, సామాజిక తరగతులు, డబ్బు పంపకాలు చుట్టూ ఈ ఎన్నికలు తిరిగాయి. అజెండా ప్రాతిపదికగా ఒక్క ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ, ఆమెను బలపరిచిన బహుళ సంఘాల ప్రచారం మినహాయిస్తే ఈ ఎన్నికల్లో అజెండాగా కనీస ప్రస్తావన కూడా వైసిపి, టిడిపి, బిజెపిలు చేయకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తోన్న కేంద్రంలోని బిజెపికి, ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థి పివిఎన్ మాధవ్‌కు పట్టభద్రులు డిపాజిట్ లేకుండా చేశారు.

వైసిపి వ్యతిరేక ప్రచారం టిడిపికి కలిసొచ్చిందా?

ఈ ఎన్నికల్లో ఓటర్లలో ఎక్కువ మంది పట్టభద్రులు మధ్యతరగతికి చెందిన వారే కావడంతో టిడిపి, జనసేన పార్టీలు ఇటీవల కాలంలో నిర్వహిస్తున్న వైసిపి ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం టిడిపికి కొంత కలిసొచ్చింది. విశాఖలో భూ కబ్జాలకు వైసిపి పాల్పడుతుందని, రుషికొండ ధ్వంసం వంటి అంశాలూ అంతర్గతంగా ఓటర్లపై పనిచేశాయన్నది తాజాగా చర్చ సాగుతోంది. టీచర్లు, ఉద్యోగులను జగన్ సర్కారు నిర్లక్ష్యం చేస్తూ సంక్షేమం పేరుతో పథకాలకు నగదు బదిలీ చేస్తూ తమ జీతాలు, డిఎలను ఎగ్గొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలపైనా పట్టభద్రులు ఓటు ద్వారా స్పందించినట్లు రూఢీ అవుతోంది. అధికార పార్టీ అర్థబలం, అధికార దర్పాన్ని ఉపయోగించినా పట్టభద్రులంతా ఆ పార్టీపై ప్రతాపం చూపారు.

సాధారణ ఎన్నికల్లో ఏ ప్రభావాలైతే పనిచేస్తాయో...

జనరల్ ఎన్నికల్లో ఏ అంశాలైతే ఓటర్లను ప్రభావం చేస్తాయో మేధావులు, విజ్ఞులైన పట్టభద్రులపైనా అటువంటి ప్రభావాలే కనిపించాయి. అభ్యర్థుల ఎంపిక కూడా సామాజిక తరగతుల ఓటింగ్ ప్రకారమే ఆయా ప్రధాన పార్టీలు ప్రకటించాయి. వైసిపి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉన్న సీతం రాజు సుధాకర్‌ను, టిడిపి ఉత్తరాంధ్రలో ప్రభావం చూపించగలిగే సామాజిక తరగతి 'కాపు'ల నుంచి వేపాడ చిరంజీవిరావును బరిలోకి దించింది. పిడిఎఫ్ తరపున డాక్టర్ కోరెడ్ల రమాప్రభను 250 ప్రజా సంఘాలు కులాతీత, ప్రాంతాలకు అతీతంగా మద్దతు ఇచ్చి పిడిఎఫ్ తరపున నిలబెట్టాయి. అన్ని తరగతుల ప్రజానీకం సమస్యలను అజెండా చేసుకుని ఉత్తరాంధ్రలో అన్ని ప్రాంతాల్లోనూ పర్యటన సాగిస్తూ ప్రచారంలో ఆమె అగ్రభాగాన నిలిచారు. పట్టభద్రులను కలిసేందుకు సమస్యలపై చైతన్యపరుస్తూ వెళ్తోన్న క్రమంలో ప్రధాన రాజకీయ పార్టీలు అవలంభించే పద్ధతులైన కులం, ధనం వంటి దుష్ప్రభావాలను పిడిఎఫ్ అభ్యర్థి తూర్పారబట్టడం ప్రత్యేకతగా నిలిచింది. అధికార వైసిపి అంచనాలకు అందని రీతిలో టిడిపి 'పోల్ మేనేజిమెంట్' చేపట్టిందన్నది స్పష్టమవుతోంది.

టిడిపిలో కీలకపాత్ర పోషించిన 'ఇద్దరే ఇద్దరు'

ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల్లోని అన్ని ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల యాజమాన్యాలను ఐక్యం చేసేందుకు ఆయా అసోసియేషన్లకు డబ్బు పంపిణీలో మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, నారాయణ విద్యాసంస్థల అధినేత నారాయణ కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. వీరు కాపు కులానికి చెందిన వారు కావడంతోటిడిపి అధిష్టానం వద్ద వేపాడ చిరంజీవిరావిని ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి సూచిస్తూ గెలుపుకోసం కృషిచేశారు. వైసిపి అభ్యర్థిగా ఉన్న సీతం రాజు సుధాకర్‌కు గానీ, ఆ పార్టీకి గానీ మొట్టమొదటసారి ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనడంతో 'పోల్ మేనేజిమెంట్' చేయడంలోనూ, అసోసియేషన్లను పట్టుకుని నిలుపుకోవడంలోనూ వైఫల్యం చెందారు. టిడిపి మాదిరిగా పట్టభద్రుల ఓట్లను రాబట్టేందుకు అంతర్గతంగా ఈ వ్యవహారాలను చక్కబెట్టే అనుభవం గంటా, నారాయణ మాదిరిగా ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి నేతలెవ్వరూ చేయలేకపోయారు. అలా చేయగల నాయకుడైన మంత్రి బొత్స సత్యనారాయణ ఆ పనిచేయలేదని తెలుస్తోంది. విజయసాయిరెడ్డికి చేసే సత్తా ఉన్నా ఆయన్ను ఈ ప్రాంతం నుంచి పార్టీ అధిష్టానం తప్పించిందన్నది వైసిపి శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. అంతేగాక వాలంటీర్ల ద్వారా పట్టభద్రులకు డబ్బులు పంచుతూ పట్టుబడడం, ఆంధ్రాయూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలతో ప్రైవేట్ హోటల్‌లో విశాఖలో సమావేశం నిర్వహించబోయి ప్రజాసంఘాలు, మీడియాకు దొరికిపోవడం కూడా వైసిపిని నైతికంగా దెబ్బతీశాయి.

విద్యార్థులకు రాగి జావ

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి

రామభద్రపురం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థులకు మెరుగైన పౌష్టికా హారాన్ని అందించేం దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని దీనిలో భాగంగా రాగిజావను ఎంపిక చేసి, సీఎం జగన్ మోహన్ రెడ్డి వర్చ్యువల్ విధానం ద్వారా ఈ నెల 21న ప్రారంభం చేస్తున్నారని జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని అదే రోజున జిల్లా వ్యాప్తంగా లాంఛనంగా ప్రారంభించేందుకు ఈ పాటశాలను ఎంపిక చేశామన్నారు. ఈ రాగిజావ 1762 పాటశాలల్లో 1.41 లక్షల మంది విద్యార్థులకు అందిస్తామన్నారు. ఇది విద్యార్దులకు బలాన్ని, శక్తిని, మనో వికాసాన్ని ఇస్తుందని అభిప్రాయపడ్డారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటకాలు రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది 10 పరీక్షలు 127 కేంద్రాల్లో పటిష్టంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వచ్చే నెల 3 నుంచి 18 వరకు జరిగే ఈ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో సుమారు 25వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఇఒ తిరుమల ప్రసాద్, ఉపాధ్యాయ సంఘాల నేతలు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్

బొబ్బిలి : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసేందుకు ఆలస్యంగా వచ్చిన ఒక విద్యార్థినిని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి పరీక్షా కేంద్రానికి పరిగెత్తుకుని వెళ్తుండగా రాజా కళాశాల రోడ్డులో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ బివి రమణ చూసి విద్యార్థినితో మాట్లాడి పరీక్షా కేంద్రం ఎక్కడ అని అడగ్గా గాయత్రీ జూనియర్ కళాశాల అని చెప్పడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కోనేటి శంకర్ తన స్కూటీతో గాయత్రీ కళాశాలకు తీసుకువెళ్లారు. దీంతో ఆవిద్యార్థిని సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకుంది. సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవడంతో ఆమె ఆనందం వ్యక్తం చేసింది. మానవత్వం చాటుకున్న పోలీసులను పలువురు అభినందిస్తున్నారు.

సార్వత్రిక టీకా కార్యక్రమం విజయవంతం

జామి : సార్వత్రిక టీకా కార్యక్రమం జయప్రదం చేయాలని ఇంచార్జ్ డిఐఒ డాక్టర్ జగదీష్ పిలుపునిచ్చారు. శనివారం జామి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. టీకా వేసే పద్ధతితో పాటు గర్భిణీలు, చిన్నపిల్లల టీకాల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి, తగిన సూచనలు చేశారు. గర్భిణీలు, బాలింతలు పట్ల ఏఎన్ఎంల పనితీరుకు సంభందించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జామి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వనజ, హెచ్ ఇ అనిల్ ప్రేమ్ కుమార్, హెచ్‌వి భవానీ, ఏఎన్ఎం చిన్నతల్లి, ఆరోగ్య సహాయకులు సన్యాసిరావు, నాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంకిలిలో బాల్య వివాహం నిలుపుదల

రేగిడి : మండలంలోని సంకిలిలో బాల్యవివాహాన్ని చైల్డ్ లైన్ టీం, మహిళా శిశు సంక్షేమం, పోలీస్ శాఖ, సచివాలయ అధికారులు శనివారం నిలుపుదల చేశారు. ఈ గ్రామానికి చెందిన ఇప్పిలి లక్ష్మణ కుమారుడు వెంకటరమణతో పాలకొండ మండలం పనుకువలసకు చెందిన పిట్ట అప్పలరాం కుమార్తె మౌనిక (13)ను ఇచ్చి వివాహం జరుపుతున్నారు. 1098 నెంబర్ సహకారంతో జిల్లా కలెక్టర్ సూర్య కుమారి ఆదేశాల మేరకు చైల్డ్ లైన్ టీం సర్సింగరావు, రాంబాబు, రమేష్ ఆ వివాహాన్ని నిలుపుదల చేశారు. వరుడు వధువు కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. 18 సంవత్సరాలు దాటి బాలికలకు వివాహం చేయాలని, లేకుంటే పుట్టిన బిడ్డతో పాటు తల్లి అనారోగ్యంతో పాటు కొన్ని సందర్భాల్లో మరణాలు తప్పవని అవగాహన కల్పించారు. బాల్య వివాహ నిలుపుదలకు ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు, ఐసిడిఎస్ పిఒ శిమ్మాలమ్మ, సర్పంచ్ బుడుమూరు పట్టాభి, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు, పంచాయతి కార్యదర్శి గోపి, మహిళా పోలీస్ స్వాతి, అంగన్వాడీ కార్యకర్తలు శాంతి, ఇందిరా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చలివేంద్రాలతో దాహం తీర్చండి

కొత్తవలస : వేసవి దృష్ట్యా ప్రతీ గ్రామంలోనూ యువకులు చలివేంద్రాలను ఏర్పాటు చేసి జనం దాహం తీర్చాలని కొత్తవలస మేజరు పంచాయితీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్యరామస్వామి పిలుపునిచ్చారు. శనివారం కొత్తవలస పంచాయితీ కార్యాలయం వద్ద, ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలి, మార్కెట్ వంటి వివిధ ప్రాంతాల్లో చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. కుండల్లో చల్లని నీటిని ప్రజలకు అందజేశారు. ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎంవిఆర్ఎల్ఎస్ ప్రసాద్, జయమ్మ, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కుమ్మరి బంజరు వద్ద నున్న గరుడాద్రి శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామీ కొండపై సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, ఆలయ కమిటీ పెద్దలు బోని వెంకట అప్పారావు దంపతులు మొక్కలు నాటారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

బాడంగి : మండలంలోని డొంకినివలసలో అక్రమంగా నిల్వ చేసిన పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో ఇంకురు శ్రీనివాసరావుకు చెందిన గోడౌన్, ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన రూ.5.32లక్షలు విలువ గల 14వేల కిలోల పిడిఎస్ బియాన్ని పట్టుకున్నామని విజిలెన్స్ ఎస్ఐ అశోక్ తెలిపారు. సదరు బియ్యాన్ని శ్రీనివాసరావు లబ్ధిదారుల నుండి కొనుగోలు చేసి అధిక ధరలకు అమ్మడానికి నిల్వ చేసినట్లు వెల్లడించారు. బాధ్యులు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సిబ్బంది రామ్మోహన్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ ఫిల్మ్‌లతో సమాజానికి మంచి

శృంగవరపుకోట : షార్ట్ ఫిల్మ్‌ల ద్వారానే సమాజంలోకి మంచి వెళుతుందని ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. కిరణ్ అన్నారు. కమల టీం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కమల? అనే షార్ట్ ఫిల్మునకు శనివారం ఆయన ముహూర్తపు సన్నివేశాన్ని ప్రారంభించారు. పట్టణంలోని ఆర్‌సిఎం చర్చ్ ఆవరణంలో గల వేలాంకిని ఆరోగ్య మాత మండపంలో ఈ సినిమాకు నియోజకవర్గ ఐటిడిపి ఇంఛార్జి అనకాపల్లి చెల్లయ్య కెమెరా స్విచ్ ఆన్ చేసారు. ఈ సందర్భంగా సిహెచ్ కిరణ్ మాట్లాడుతూ ఈ చిత్రం సమాజానికి ఓ మంచి సందేశాన్ని అందిస్తుందని ఇటువంటి షార్ట్ ఫిల్మ్‌లు తీసేందుకు యువత మరింత ముందుకు రావాలని కోరారు.

గుణుపూరు పేటలో హౌసింగ్ డే

డెంకాడ : మండలంలోని గునుపురు పేటలో హౌసింగ్ డే కార్యక్రమం ఎంపిడిఒ డిడి స్వరూపురాణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీ మంజూరైన లబ్దారులతో ఆమె మాట్లాడారు. త్వరగా జగనన్న ఇల్లులు పూర్తి చేయాలని లబ్ధిదారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులను భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నారా లేదని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

వేపాడ : హౌస్ మ్యాపింగ్ అవసరంపై అవగాహన కల్పించాలని తహశీల్దార్ కృష్ణంరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రభుత్వ పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ చేరాలంటే తప్పనిసరిగా హౌస్ మ్యాపింగ్ అవసరమన్నారు. సచివాలయానికి వచ్చిన ప్రజలకు హౌస్ మ్యాపింగ్ అంటే ఏమిటి దాని వల్ల కలిగే ప్రయోజనాలు గూర్చి వివరించాలన్నారు.

సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలి

విజయనగరం టౌన్ : జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జాతీయ బి సి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు జల వనరుల అధికారి కె. లోకేష్‌ను కోరారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో నాగావళి, వేగావతి, గోముఖి, సువర్ణముఖి, చంపావతి, గోస్తాని సహజ నదులు జిల్లాలో ఉన్నప్పటికీ వినియోగంలో వెనుకబడి ఉన్నామని తెలిపారు. జిల్లాలో మీడియం నీటి నీటిపారుదల ప్రాజెక్టులు అయినా తాడిపూడి, వేగావతి, వట్టి గెడ్డ, తారకరామా, పెదంకలాం, సీతానగరం, డెంకాడ, పారాది, సురపాడు, నాగావళి కుడి ఎడమ చానళ్లు, ఉత్తరాంధ్ర సుజలస్రవంతి ప్రాజెక్టు కింద రైవాడ ప్రాజెక్టు, వీరనారాయణ రిజర్వాయర్, తాండవ ప్రాజెక్టు, జంజావతి, ప్రాజెక్టులు నిర్మాణము నిధులు లేక నత్తనడకన నడుస్తున్నాయని తెలిపారు. విజయనగరంలో పూర్తిగా వర్షాధారం మీద ఆధారపడి వ్యవసాయం సాగుబడి జరుగుతుందని తెలిపారు. సకాలంలో రైతులకు నీరు అందక పంటలు ఎండిపోయి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిలి నాగభూషణం రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గెలుపుతో మరింత ముందుకు

ప్రజాశక్తి – నెల్లిమర్ల

ఎమ్మెల్సీ గెలుపుతో మరింత ముందుకు వెళ్తామని టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. ఉత్తరాంధ్ర పట్ట భద్రుల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి చిరంజీవరావు విజయం సాధించిన నేపథ్యంలో నియోజకవర్గం టిడిపి శ్రేణులు శనివారం విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సంధర్భంగా నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపిని గెలిపించి అధికార పార్టీకి ప్రజలు చెంప దెబ్బ కొట్టారన్నారు. ముఖ్యంగా వైసిపిపై ప్రజా వ్యతిరేకతను పట్ట భద్రులు, ఉద్యోగులు తమ ఓటుతో చూపించారన్నారు. ప్రజలందరూ టిడిపిని కోరుకుంటున్నారనడానికి ఈ ఎన్నికలే తార్కాణమన్నారు. ఎమ్మెల్సీ గెలుపు స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని మరింత ఉత్సాహంతో ముందుకు వెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్ర శేఖర్ రావు, మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, అవనాపు సత్య నారాయణ, డెంకాడ మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కర రావు, భోగాపురం మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్య నారాయణ అకిరి ప్రసాద్, పాణి రాజు, చింతపల్లి సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గ్రామం వద్ద టిడిపి మండల పార్టీ కార్యదర్శి గంట పోలినాయుడు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికలో టిడిపి విజయం సాధించినందుకు కేక్ కట్ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. 2024 ఎన్నికల్లో కచ్చితంగా టిడిపి విజయం సాధిస్తుందనడానికి ఈ విజయమే తార్కాణమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఆనందంతో నృత్యం చేస్తున్న బేబినాయన

నెల్లిమర్ల: ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

డెంకాడ: వైసిపి అంచనాలను పట్టభద్రులు తిప్పికొట్టి ఈ దుర్మాగపు పాలనకు సరైన గుణపాఠం నెర్పారని టిడిపి మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు అన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు, తూర్పు రాయలసీమ పట్టభద్రుల టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విజయం సాధించడంపై మండల కేంద్రంలో శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇదే విజయం 2024లో కూడా పునరావృతమవుతాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, నాయకులు పల్లె భాస్కరరావు, అప్పలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా చిరంజీవిరావు విజయం సాధించడం వైసిపి పతనానికి నాంది అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి చింతల రామకృష్ణ అన్నారు. శనివారం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాల సర్పంచ్, ఉంపిటిసి, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, పార్టీ అధ్యక్షుడు కరణం విజయ భాస్కరరావు, చిన్నమ్మతల్లి, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం అభినందన ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. కులం, ప్రాంతం, మతం అనే భేదం లేకుండా ఇచ్చాపురం నుంచి ఇడుపులపాయ వరకు పేద మధ్యతరగతి నిరుద్యోగ యువతీ యువకులు, ఉపాధ్యాయులు ఈ జగన్ పాలన మాకొద్దు అని తిరస్కరించడమే టిడిపి గెలుపునకు కారణమన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గెద్ద అన్నవరం, అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గొర్రె ముసలి నాయుడు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి రాజగోపాల్, నాయకులు రెడ్డి ఎర్రి నాయుడు, సిరిపురపు గురు నాయుడు, పాంద్రంకి సత్యనారాయణ, గుమ్మిడి సింహాచలం, రెడ్డి ఆదినారాయణ, పోరిపి రెడ్డి శ్రీను, టి. సత్యనారాయణ కలిశెట్టి సత్య రావు, నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి : ఉత్తరాంధ్రలో టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావు ఎన్నిక చారిత్రాతక విజయమని, ఈఎన్నికలు వైసిపికి చెంపపెట్టు లాంటిదని జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి, రేగిడి మండల టిడిపి మాజీ అధ్యక్షులు కిమిడి వినయ్ కుమార్ అన్నారు. రేగిడిలో ఎమ్మెల్సీ చిరంజీవి రావు ఎన్నికపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఆర్థిక విధానాలతో పాటు అన్ని రంగాలలో ప్రజా విశ్వాసం కోల్పోయిందని అన్నారు.

బొబ్బిలి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడంతో కోటలో శనివారం విజయోత్సవ సంబరాలు జరిపారు. టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, కార్యకర్తలు, నాయకులు సందడి చేశారు. కార్యకర్తలు, అభిమానులతో కలిసి బేబినాయన, తెంటు రాజా డాన్స్ చేశారు. కోట నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బేబినాయన, తెంటు రాజా మాట్లాడుతూ వైసిపి పాలనపై ప్రజలు విసుగు చెందుతున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఆ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు రామమూర్తి, రాంబార్కి శరత్, గెంబలి శ్రీను, సుంకరి సాయి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: దుప్పాడలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

గనుల తవ్వకాలకు అంగీకారం

ప్రజాశక్తి – కొత్తవలస

మండలంలోని అప్పన్న దొరపాలెం రాఖీ మినరల్స్, పెదరావుపల్లి గ్రామం వద్ద జి. సుదర్శనరావు క్వారీలో గనుల తవ్వకాలకు అనుమతులు కోరుతూ శనివారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. సర్వే నెంబర్ 1/8లోని ప్రభుత్వ భూమిలో 7,025 హెక్టార్ల విస్తీర్ణంలో, 20 సంవత్సరాల కాలానికి రోడ్డు మెటల్ అండ్ బిల్డింగ్ స్టోన్, గ్రావెల్ వెలికి తీసేందుకు, పెదరావపల్లి గ్రామం వద్ద సుదర్శన్ రావు 12 హెక్టార్లలో సర్వే నెంబరు 1 లోని ప్రభుత్వ భూమిలో గనులు తవ్వకాలకు, అప్పన్నదొరపాలెం, పేదరావుపల్లి గ్రామ ప్రజలు ఆమోదం తెలిపారు. అప్పన్న దొరపాలెం, కాటకాపల్లి గ్రామ పంచాయతీ, పెదరావుపల్లి గ్రామం వద్ద విజయనగరం డిఆర్ఒ ఎం.గణపతిరావు సమక్షంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ టి.సుదర్శన్ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. గనుల తవ్వకాల్లో స్థానికులకు ఉపాది కల్పిస్తామని, దుమ్ము, దూళి ఇతర కాలుష్యం లేకుండా, పర్యావరణ పరిరక్షణకు రోడ్డుకు రెండు పక్కల మొక్కలు నాటి పెంచుతామని లీజు పొందిన దాట్ల భీమరాజు, ప్రజలకు తెలిపారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని, స్థానికంగా ఉన్న మహిళలకు ఉపాధి కల్పించాలని, శబ్ద కాలుష్యం లేకుండా చూడాలని గ్రామ పంచాయతీ అప్పన్నదొరపాలెం సర్పంచ్ జోడు రాములమ్మ, రెల్లి ఎంపిటిసి ఉగ్గిన గురూజీ,

మాట్లాడుతున్న డిఆర్ఒ గణపతిరావు

కాటకాపల్లి సర్పంచ్ పీతల కృష్ణ, ఎంపిటిసి కీలపర్తి అప్పల పరదేసి నాయుడు, గ్రామస్తులు, చినరావుపల్లి మాజీ సర్పంచ్, గ్రామస్తులు కోరారు. మైనింగ్ చేసే ప్రదేశం గ్రామానికి దూరంగా ఉందని, అయినప్పటికీ కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ సుదర్శనరావు లీజుదారుడును ఆదేశించారు. గ్రామస్తులతో పాటు ఎన్జీవో సంఘ నాయకులు, పలు స్వచ్ఛంద సంస్థలు గ్రామాభివృద్ధి కోరుతూ దాట్ల భీమరాజు, జి. సుదర్శనరావు ప్రాజెక్టు మైనింగ్ చేసుకునేందుకు అంగీకారాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ హర్షవర్ధని, ఐఎన్‌డి కిషోర్, విఆర్ఒ, గ్రామ పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి మేలు

డెంకాడ : నవధాన్యాలు సాగు చేయడం ద్వారా భూమి సారవంతమవుతోందని ఇందులో ప్రకృతి వ్యవసాయం చేస్తే ఆరోగ్యానికి ఎంతో ఉపయోగ పడుతుందని మండల ప్రకృతి వ్యవసాయ సలహాదారు పివి గురుమూర్తి తెలిపారు. మండలం లోని నాతవలసలో నవధాన్యాలు ప్రకృతి సాగుపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి వస్తుందని ఎరువుల ఖర్చు తగ్గుతుందని తద్వారా రైతులకు ఖర్చులు తగ్గి ఆదాయం ఎక్కువగా వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఫీల్డ్ అసిస్టెంట్ సురేషు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బానాదిలో రైతులతో నవధాన్యాలు సాగుపై అవగాహన కల్పించారు. మినుము, పెసలు, ఉలవలు, నువ్వులు, కందులు విత్తనాలతో పాటు కాయగూర విత్తనాలు చిరుధాన్య విత్తనాలను జీలుగ, జనుము, వరికి ముందు తొలకరిలో సుమారుగా 26 నుండి 30 రకాలు విత్తనాలు ఎకరాకు పది నుండి 12 కేజీలు వేయాలన్నారు. వరి నాట్లు వేసే ముందు ఘనజీవామృతి ఎకరాకు 400 కేజీలు వేసినట్లయితే

వేపాడ: అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రైతులు పంట పూర్తి కాలంలో యూరియా, డిఎపి, పటాస్ అవసరాలు లేకున్నా వినియోగించుకున్న పంటని పండించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో యాంకర్ రామలక్ష్మి, ఎల్‌సిఆర్‌పి అప్పలనాడు, రైతులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : ఆరు తడి పంటల రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అంద జేస్తుందని ఇంచార్జి ఎడి యం.శ్యాం సుందర్ తెలిపారు. కోమటిపల్లి గ్రామంలో శనివారం సచివాలయ వ్యవసాయ సహాయకునీతో చిరు ధాన్యాలను పంపిణీ చేయిం చారు.ఉలవలు, మినుములు కావలసిన రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రాలలో సంప్రదించాలని అన్నారు.

లెండీలో ముగిసిన లక్ష్య -23

ప్రజాశక్తి– డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైన ఎలక్ట్రికల్ విభాగ విద్యార్థి సంఘ వార్షికోత్సవం లక్ష్య–2023 రెండో రోజు శనివాకం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా ముగిసింది. ముందు రోజు జరిగిన సాంకేతిక విజ్ఞాన ప్రదర్శన, రోబో రేస్, రోబో వార్‌లలో, పలు క్రీడలలో అద్భుతమైన ప్రదర్శన చేసిన విద్యార్థులకు మొదటి, ద్వితియా బహుమతులను ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామరెడ్డి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ కె.సుబ్బరామయ్య ప్రదానం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ విభాగపు వార్షిక సంచిక 'లక్ష్య 2023' ను డీన్ అండ్ ట్రైనింగ్ అండ్ ప్లేసమెంట్ సెల్ ఆఫీసర్ ప్రకాష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, విభాగాధిపతుల బృందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, ప్రస్తుత కాగ్నిజంట్‌లో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న ఎం. మహేష్ మాట్లాడుతూ రాబోయే కాలంలో భారత దేశం ప్రపంచ ఆర్థిక వనరుగా మారబోతోందన్నారు. అందుకు తగ్గ నైపుణ్యాలను సాధించి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని తమ జూనియర్ విద్యార్థులకు సూచించారు. అనంతరం మహేష్ ను ఎలక్ట్రికల్ ఉపాధ్యాయ బృందం సన్మానించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.వి.స్. ఆచార్యులు, డాక్టర్ మంగ రాజు, డాక్టర్ పి. జానకి, కె.ప్రవీణ్ కుమార్, విద్యార్థి సంఘ నాయకులు కె. పార్థసారథి, సుధరాణి, శివానంద, భావన తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థులు

అంగన్‌వాడీల వినతి

శృంగవరపుకోట : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 21వ తేదీ మంగళవారం విధులకు హాజరు కాకుండా సెలవు పెట్టి విజయనగరం డిఎంఅండ్‌హెచ్ఒ జరగనున్న ధర్నాకు వెళుతున్నామని ఆశా వర్కర్లు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని కొట్టాం పిహెచ్‌సి వైద్యులు నిహారికకి ఆశా వర్కర్లు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

విజయనగరం టౌన్ : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నగరంలో ప్రజలకు ఎటువంటి నీటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటునట్లు ప్రజారోగ్య శాఖ, పర్యవేక్షక ఇంజినీర్ కె.రాజారావు తెలిపారు. శనివారం రాజాం నగర పంచాయతీలో రేగిడి పంప్ హౌస్ ను, విజయనగరం నీటి పథకాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం ఇస్తున్న నీటిశాతం తగ్గకుండా వుండేలా ఎక్కడికక్కడ నీటి నిల్వ, క్రాస్ బండ్లు అవసరాన్ని బట్టి గుర్తించి అందుకు తగ్గట్టుగానే పైప్ లైన్, బోర్ వేల్స్ మెయింటెనెన్సు పనులకు, మోటారు మరమ్మత్తులకు మెటీరియల్ కొనుగోలు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. ఆయన వెంట విజయనగరం కార్యనిర్వహక ఇంజినీర్, కె.దక్షిణా మూర్తి, రాజాం మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కె.రత్నాకర్, టెక్నికల్ అధికారి కె.ఫణికుమార్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి అక్రమ తవ్వకాలు

కొత్తవలస : మండలంలోని నిమ్మలపాలెం రావి చెరువులో శుక్రవారం అర్ధరాత్రి అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగాయి. గ్రామాన్ని కాపాడవలసిన వారే, అక్రమ తవ్వకాలు చేపట్టడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. నిమ్మలపాలెం సర్పంచ్ భర్త కొట్యాడ శ్రీను, చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అహంకార, అధికార బలంతో మట్టిని తరలించేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తన వ్యక్తిగత వాణిజ్య అవసరాల కోసం స్వయంగా దగ్గరుండి మరి జెసిబి ట్రాక